క్లుప్తంగా

29న జాబ్‌మేళా

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 29వ తేదీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే ప్రభుదాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటాయన్నారు. కంపెనీలో ఖాళీలు ఉన్నాయని, ప్రకాశం జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్‌మీడియట్ నుంచి పీజీ వరకు చదివిన 19 నుంచి 28 ఏళ్ల మధ్య వయస్సు గలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ విజయవాడ, ప్రకాశం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, దర్శి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏ నగేష్, ట్రెనింగ్ కో ఆర్డినేటర్ ఎస్.రమేష్ (9247433273, 9949914337)లను సంప్రదించాలని కోరారు.

ఫిజిక్స్ పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరు

తాళ్లూరు: మండలంలో బుధవారం నిర్వహించిన పదో తరగతి ఫిజికల్ సైన్స్ పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో 820 మందికిగానూ 809 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాలను ఎంఈఓ-1 సుబ్బయ్య, ఎంఈఓ-2 సుధాకర్ పర్యవేక్షించారు.

ఈద్గాకు సొంత నిధులతో మరమ్మతులు



అందంగా తీర్చిదిద్దిన ఈద్గా

దొనకొండ: కొన్ని సంవత్సరాల క్రితం ముస్లింలు దొనకొండలోని వీవీ పురం సమీపంలో ప్రార్థనలు జరుపుకునేందుకు ఈద్గా నిర్మించుకున్నారు. రంజాన్, బక్రీద్ పండుగలకు ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేసుకుంటారు. ప్రస్తుతం రంజాన్ పండుగ నేపథ్యంలో దొనకొండకు చెందిన షేక్ మహమ్మద్ హనీఫ్ తన సొంత నిధులతో ఈద్గాకు మరమ్మతులు చేశారు. రంగులు వేయించి ఈద్గాను అందంగా తీర్చిదిద్దారు. మహమ్మద్ హనీఫ్‌ను ముస్లిం పెద్దలు అభినందించారు.

పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు ఎంచుకోండి



మాట్లాడుతున్న ఏఓ బాలకృష్ణనాయక్

దర్శి: పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు ఎంచుకోవాలని ఏఓ బాలకృష్ణనాయక్ రైతులకు సూచించారు. మండలంలోని వెంకటాచలంపల్లి, దర్శి-5 సచివాలయాల పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణనాయక్ మాట్లాడుతూ పొగాకు వేసిన రైతులు మళ్లీ శనగ, ఇతర పంటలు వేసుకోవడం, పంట మార్పిడి చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో గిట్టుబాటు ధరకు కందులు అమ్ముకోవాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌జీ సోమ్లానాయక్, అనూషా తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు పెరిగాయి



కొవ్వొత్తుల ర్యాలీలో మాట్లాడుతున్న పాస్టర్ కృపానందం

దర్శి: రాష్ట్రంలో క్రైస్తవులపై దాడులు పెరిగాయని దర్శి గ్రేస్ రీజినల్ పాస్టర్స్ అసోసియేషన్ నాయకుడు గుంటూరు కృపానందం అన్నారు. జాతీయ సువార్తీకుడు ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా దర్శి పట్టణంలో పాస్టర్లు బుధవారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పాస్టర్ కృపానందం మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వారిని హేళన చేస్తున్న పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవీణ్ పగడాలది ప్రమాదకరమైన మృతి కాదని, ఇది ఎవరో చేసిన హత్య అని పలు క్రైస్తవ సంఘాలు ఆరోపిస్తున్నాయన్నారు. ఈ మృతిపై సీబీసీఐడీ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం, డిప్యూటీ సీఎం, హోం మంత్రులు స్పందించి క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు ఎస్.ఏసయ్య, మల్లెల యోహాను, పౌలు, గర్నెపూడి యోనాష్, దళిత నాయకులు గోవింద్ ప్రసాద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులూ.. నన్ను చూడండి !

- అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం
- గడియారం స్తంభం సెంటర్‌లో ఎస్‌ఎస్‌పీ వాటర్ లీకేజీ
- మూడు నెలలుగా పట్టించుకోని అధికారులు
- భారీగా వృథా అవుతున్న తాగునీరు
- రోడ్డు నుంచి రెవెన్యూ ఆఫీసు, పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోకి ప్రవహిస్తున్న నీరు



నీరు వెళ్లేందుకు దారి లేక రెవెన్యూ కార్యాలయంలోకి వస్తున్న తాగునీరు

దర్శి: ప్రజలకు నిత్యం అందించాల్సిన తాగునీరు వృథాగా పోతుంటే ఎస్‌ఎస్‌పీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గుడ్లప్పగించి చూస్తున్నారు. గ్రామాలకు నీరు సరిగా అందించకపోవడం ఒక నిర్లక్ష్యం అయితే ... నియోజకవర్గ కేంద్రంలో నిత్యం వేలాది మంది తిరిగే సెంటర్‌లో రోడ్డు పైన మూడు నెలలుగా నీరు లీకవుతుండటం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. వివరాల్లోకి వెళితే... దర్శి పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో మూడు నెలలు క్రితం ఎస్‌ఎస్‌పీ పైప్ లైన్‌కు చిన్న లీకు ఏర్పడింది. ఆ లీకును వెంటనే మరమ్మతులు చేస్తే సరిపోయేది. చిన్న లీకేకదా అని వదిలేశారు. అది కాస్త పెద్దదై నిత్యం రోడ్డు పై నీరు పారి అది పోయే దారిలేక 'అధికారులూ నన్ను చూడండంటూ' ఏకంగా రెవెన్యూ, పోలీస్ స్టేషన్ ఆవరణలోకి నీరు పారుతోంది. దీంతో ఈ ఆవరణలో ఉన్న రెవెన్యూ, పోలీస్ స్టేషన్ లతో పాటు సబ్‌జైల్, ట్రెజరీలకు పలు అవసరాలపై వచ్చే వారు లోపలికి రాకపోకలు సాగించాలంటే అసౌకర్యంగా ఉంది. తాగునీరు వృథాగా పోతున్న సంగతి చూస్తున్న స్థానికులు తాగేందుకు గుక్కెడు నీరు సరఫరా చేయరు.. వృథాగా పోతున్న తాగునీరు అరికట్టరు అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.



రోడ్డు పై తాగునీరు లీకవుతున్న దృశ్యం



రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో మడుగులుగా మారిన తాగునీరు

ఉపాధ్యాయుడిపై నేడు విచారణ

కురిచేడు: మండలంలోని పడమరనాయుడుపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు కరిముల్లాపై గురువారం డిప్యూటీ డీఈఓ విచారణ చేపట్టనున్నారు. విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆయనపై ఆరోపణలు రావడంతో జిల్లా విద్యాశాఖాధికారి సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఈ సంఘటనపై విచారణ జరపాలని జిల్లా విద్యాశాఖ నుంచి మండల విద్యాశాఖకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో సదరు ఉపాధ్యాయుడిని కాపాడేందుకు మండల విద్యాశాఖ అధికారులు వారం రోజులుగా నానాప్రయత్నాలు చేస్తున్నారు. కూటమి నాయకులతో మంతనాలు జరిపి ఎలాగైనా విచారణలో వాస్తవాలు బయటకు రాకుండా చేసి ఉపాధ్యాయుడిని కాపాడటమే లక్ష్యంగా మండల విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం ఊపందుకుంది. విద్యాశాఖకు అప్రతిష్ట వస్తుందనే నెపంతో ఉన్నతాధికారులు కూడా మొక్కుబడిగా విచారణ జరపనున్నట్లు ఉపాధ్యాయ వర్గాలు బహిరంగంగా పేర్కొంటున్నాయి. ఎంఈఓలపై వచ్చిన ఆరోపణలపై జరిగిన విచారణ లాగానే ఉపాధ్యాయుడిపై కూడా విచారణ జరుగుతుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ముందస్తుగా విచారణాధికారికి సన్మానం చేసేందుకు కూడా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఫిర్యాదు చేసిన గ్రామస్తులు నిజాయితీగా విచారణలో వాస్తవాలు వెల్లడిస్తారా.? లేకుంటే కూటమి నాయకులు, అధికారులు చేసిన ప్రయత్నాలకు తలొగ్గి విషయాన్ని దాస్తారా..? కీచక గురువుపై చర్యలు తీసుకుంటారా..? అని మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు.



ఉపాధ్యాయుడిపై ఎంఈఓకు ఫిర్యాదు చేస్తున్న ఎస్‌ఎంసీ చైర్మన్, గ్రామస్తులు (ఫైల్)

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

దర్శి: దర్శిలో జూన్ 21, 22, 23 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ జిల్లా స్థాయి 17వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పిలుపునిచ్చారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో బుధవారం సీపీఐ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. జూపల్లి కోటేశ్వరరావు అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నారాయణ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాల వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా మహాసభలకు సిద్ధం కావాలన్నారు. ప్రస్తుతం దేశ, రాష్ట్ర రాజకీయ పార్టీల ఆలోచనలు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ప్రధాన పార్టీలు బీజేపీకి తొత్తులుగా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రయోజనాలను మోదీ, అమిత్‌షాలకు తాకట్టుపెడుతున్నారని అన్నారు. రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తయితే పశ్చిమ ప్రకాశం సస్యశ్యామలంగా ఉంటుందని చెప్పారు. పాలకులు ఆ ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించకుండా ఈ ప్రాంత ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. దొనకొండను పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా సమస్యలపై సీపీఐ మహాసభల్లో చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్‌డీ యాసీన్, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కే హనుమంతరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజి యాదవ్, మండల కార్యదర్శి సీహెచ్ గురుమూర్తి, సింగరకొండ శ్రీను, కల్లూరి పెద్ద ఆంజనేయులు, ఇత్తడి ఇర్మియా, కేవీ రెడ్డి, సీహెచ్ అరుణమ్మ, వీ శ్రీను, స్టాలిన్, తన్నీరు వెంకటేశ్వర్లు తదితర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ నారాయణ

లోపం లేకుండా పనులు చేయించండి

- ఎస్సీ హాస్టల్ మరమ్మతులను పరిశీలించిన సాంఘీక సంక్షేమశాఖ ఉపసంచాలకులు లక్ష్మీనాయక్

దర్శి: కోరినన్ని నిధులిచ్చాం.. ఎక్కడా రాజీపడకుండా పనుల్లో లోపాలు లేకుండా అధికారులు దగ్గరుండి చేయించాలని సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఎన్.లక్ష్మీనాయక్ ఆదేశించారు. స్థానిక ఎస్సీ హాస్టల్లో రూ.34 లక్షలతో చేస్తున్న మరమ్మతు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. బాత్‌రూమ్‌లలో గోడలకు, కింద టైల్స్, దర్వాజాలు, తలుపులు, లెట్రిన్ సిస్టమ్ మొత్తం మార్చివేసి కొత్తవాటిని వేయాలని ఆదేశించారు. భవనంలో మొత్తం వైరింగ్, పైప్ లైన్లు, స్విచ్‌బోర్డులు, స్విచ్‌లు కొత్తవి వేయాలని సూచించారు. పాత భవనంకు స్లాబు పెచ్చులూడిన చోట ప్లాస్టింగ్ చేసిన తీరును పరిశీలించారు. బోర్డులు నూతనంగా ఉండాలని, గోడలకు మరమ్మతులు పూర్తి స్థాయిలో చేయాలని సూచించారు. పనిలో ఎక్కడ రాజీపడినా సహించేది లేదన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మీనాయక్ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాలకు రాష్ట్రవ్యాప్తంగా రూ.150 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో 38 వసతి గృహాలకు రూ.13 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. ప్రతి సంక్షేమ హాస్టల్లో అంబేడ్కర్ ఆఫ్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒంగోలు బాలికల వసతి గృహం-1కు రూ.6.15 కోట్లు, బాలికల వసతి గృహం-2, 3లకు రూ.5.12 కోట్లు, సంతనూతలపాడు, చీమకుర్తి బాలుర వసతి గృహాలకు రూ.4 కోట్లు, ఒంగోలు మెట్రిక్ బాలుర వసతి గృహానికి రూ.3 కోట్లు, ఒంగోలు ప్రభుత్వ బాలుర కళాశాల-2 అదనపు బిల్డింగ్‌కు రూ.75 లక్షలు, పరివర్త భవనంకు రూ.60 లక్షలు కలిపి రూ.19.62 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ సహాయ అధికారి ఎస్‌కే రజియా బేగం, సహాయ సంక్షేమాధికారి డీ రజినీ కుమారి, వార్డెన్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



వాష్‌రూం పనులను పరిశీలిస్తున్న లక్ష్మానాయక్

నేటి నుంచి ఉగాది సప్తాహ వేడుకలు

కురిచేడు: స్థానిక శ్రీ కోనవల్లభరాయస్వామి కొండపై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం నుంచి ఉగాది సప్తాహ వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు సూరే సత్యనారాయణ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి జరిగే పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కరివేపాకులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

తాళ్లూరు: కరివేపాకు పంటను పరిస్థితులను బట్టి నీటిపారుదల పంటగానూ, వర్షాధార పంటగానూ సాగుచేయవచ్చని మండల వ్యవసాయ అధికారి బి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని బొద్దుకూరపాడు, వెలుగువారిపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం కరివేపాకు పంటను పరిశీలించి పంట సాగుపై అవగాహన కల్పించారు. అధిక దిగుబడులు ఎలా పొందవచ్చనే దానిపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు. కరివేపాకు పంటకు ఏడు రోజులకు ఒకసారి నీటి తడి ఇవ్వాలన్నారు. ఒక మీటర్ ఎత్తు పెరిగిన తర్వాత చివరలు తుంచాలన్నారు. కలుపును ఎప్పటికప్పుడు తీసుకోవాలన్నారు. తద్వారా మంచి దిగుబడి వచ్చి రైతులు లాభాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు అజ్మీర్, సుష్మ, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏవో ప్రసాదరావు



నాగేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న బూచేపల్లి

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు బూచేపల్లి నివాళి

మద్దిపాడు (దర్శి) మండలంలోని పూరిమెట్ల గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చింతలపల్లి నాగేశ్వరరావు మృతదేహానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి బుధవారం నివాళులర్పించారు. ఆయన మృతికి గల కారణాలడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మండల కన్వీనర్ చింతా శ్రీనివాస రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి కందుల కొనుగోలు

దొనకొండ: మండలంలో నేటి నుంచి కందుల కొనుగోలు ప్రారంభమవుతుందని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. పడమర కంభంపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ఆరవల్లిపాడు గ్రామంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిందని చెప్పారు. గ్రామాల్లోని రైతులు పండించిన కందులను కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలన్నారు. మద్దతు ధర రూ.7,550 అని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో 2,391 మంది రైతులు 5,515 ఎకరాల్లో కంది పంట సాగు చేశారన్నారు. ఈ పంట నమోదు చేసుకున్న రైతులు వారి ఆధార్ కార్డు తీసుకుని కొనుగోలు కేంద్రానికి వెళ్లాలన్నారు. ఈ అవకాశాన్ని గ్రామాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ తెలిపారు.

డీకే పట్టాదారులు విశిష్ట సంఖ్యకు అర్హులే...

గ్రామాల్లో అసైన్‌మెంట్, డీకే పట్టా భూములున్న రైతులు కూడా విశిష్ట సంఖ్య నమోదు చేయించుకునేందుకు అర్హులని ఏఓ తెలిపారు. సమీపంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు. మంగినపూడి గ్రామంలో పొలం పిలుస్తోంది గ్రామ సభలో పాల్గొని రైతులతో మాట్లాడారు. ఆయన వెంట సిబ్బంది రాధిక, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ

ఊరికి దూరంగా అంగన్‌వాడీ కేంద్రం

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులో ఊరికి దూరంగా ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒక గదిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామంలో మఠం అరుగు సెంటర్‌లో ఉండాల్సిన కేంద్రాన్ని గ్రామానికి దూరంగా ఐసీడీఎస్ అధికారులు ఏర్పాటు చేశారు. దాదాపు అర కిలోమీటరు దూరంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి చిన్నారులు, బాలింతలు, గర్భిణులు నడుచుకుంటూ వెళ్లి రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి రోజు కేంద్రానికి చిన్నారులను పంపించాలంటే భయపడుతున్నామని తల్లిదండ్రులు తెలిపారు. ఈ రహదారిలో ఖాళీ స్థలాలు, చిల్లకంప చెట్లు ఉండటంతో పాటు పొలాలకు వెళ్లే ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. పౌష్టికాహారం కోసం దూరంగా ఉన్న కేంద్రానికి పోయి రావాలంటే చాలా కష్టతరంగా ఉందని గర్భిణులు, బాలింతలు వాపోతున్నారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గ్రామంలో అన్ని వసతులు కలిగి ఉన్న పంచాయతీ కార్యాలయం ఖాళీగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో ఖాళీగా ఉన్న పంచాయతీ కార్యాలయంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.



ఎంపీపీ పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

ఉపాధి కూలీలకు అవగాహన కల్పించాలి

తాళ్లూరు: ఎండాకాలం నేపథ్యంలో ఉపాధి హామీ పథకం కూలీలకు మంచినీరు, మజ్జిగ, ఓఆర్‌ఎస్ సౌకర్యాలు కల్పించాలని ఏపీవో మురళి సూచించారు. మండలంలోని ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం మండలంలోని 80 మంది మేట్లకు మహాత్మా గాంధీ ఉపాధి హామీ పనులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ కాలువలో 6 మీటర్లు, చెరువులో రెండు మీటర్ల పొడవు మట్టి తవ్వడం వలన కూలీలకు రోజుకు రూ.300 వరకు వస్తాయన్నారు. తద్వారా వారి ఆదాయం పెరుగుతుందన్నారు. గ్రూపులో ఉన్న సభ్యులు ఐకమత్యంతో పనులు చేయాలని తెలిపారు. ఇందులో ఏపీఓ మురళి, ఈసీ గురుబాబు, పీఏ కోటేశ్వరరావు, రమేష్, అచ్చిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఓ మురళి

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి

యర్రగొండపాలెం: దైవ సువార్తికుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరపాలని బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద పాస్టర్లు ఆందోళన చేశారు. బైక్ ప్రమాదంలో ప్రవీణ్ పగడాల మృతి చెందాడని ముందుగా భావించారని, ఆయన శరీరంపై గాయాలు ఉండటాన్ని బట్టి చూస్తే ఎవరో హత్య చేసి ఉంటారన్న అనుమానం ఉందని, వెంటనే పోలీసులు ఈ కేసుపై దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రవీణ్ పగడాల మృతికి వారు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాస్టర్ల సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.సుందరరాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గర్నెపూడి వినయ్, పాస్టర్లు ప్రవీణ్‌కుమార్, పగులయ్య, వెంకటయ్య, రామ్మూర్తి నాయక్, రామయ్య, బాబు, ఇమ్మానియేలు, షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.



వైపాలెంలో ఆందోళన చేస్తున్న పోలీసులు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)

Office mail : sakshiongads@gmail.com